క్లుప్తంగా

పోషకాహారంతో వ్యాధులు దూరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: ప్రతి ఒక్కరూ పోషకవిలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా వ్యాధులను దూరం చేయవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని వేదగిరివారిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఎత్తు, బరువు, వైద్య పరీక్షలు నిర్వహించారు. బరువు తక్కువగా ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులను పిలిచి సరైన పోషకాహారం అందించేలా చూడాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పశు వ్యాధులను నిర్లక్ష్యం చేయొద్దు



మందులు పంపిణీ చేస్తున్న ఏడీ పద్మావతి

ఐరాల: పశువులు, జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేయొద్దని మండల పశుసంవర్ధకశాఖ ఏడీ పద్మావతి సూచించారు. మండలంలోని దివిటివారిపల్లెలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఏడీ మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న గోకులం షెడ్లు, పశుగ్రాసం పెంపకం వంటి పథకాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీజనల్‌గా గేదెలు, ఆవులు, ఎద్దులు, జీవాల్లో వ్యాపించే వ్యాధుల నివారణకు ఉచితంగా ఇస్తున్న టీకాలను తప్పనిసరిగా వేయించుకోవాలని తెలిపారు. వాటికి ఎలాంటి అనారోగ్యం కలిగినా రైతు సేవా కేంద్రాల్లోని పశువైద్య సిబ్బందిని సంప్రదించి చికిత్స చేయించాలన్నారు. అనంతరం 150 గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందు తాపించారు. 300 పశువులకు చూడినిర్ధారణ, ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.

శాంతకుమారి సేవలు శ్లాఘనీయం



శాంతకుమారిని సన్మానిస్తున్న వైద్య బృందం

గుడిపాల: వైద్యరంగంలో శాంతకుమారి సేవలు శ్లాఘనీయమని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి హనుమంతరావు అన్నారు. బొమ్మసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారి శాంతకుమారి ఉద్యోగ విరమణ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 39 ఏళ్లుగా ఆరోగ్య విభాగంలో అంకితభావంతో పనిచేసిన శాంతకుమారి అందరి మన్ననలు పొందినట్లు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్లు సంధ్య, అనూష, మాజీ ఎంపీపీ నాగరాజయాదవ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కొత్తకోటలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ప్రజలకు ఇంటి వద్దే వైద్యం అందుతోందని బొమ్మసముద్రం పీహెచ్‌సీ డాక్టర్ అనూష అన్నారు. కొత్తకోట గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెర వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సరళ, హైమావతి, గీత, తమరై పాల్గొన్నారు.

సొంతింటి నిర్మాణానికి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర పరిధిలో సొంతంగా ఇంటి స్థలం ఉన్నవాళ్లు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇల్లు నిర్మించుకోవడానికి దరఖాస్తు చేసుకోవాలని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వాళ్లు ఆయా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా రూ.2.5 లక్షలు మంజూరు చేస్తామన్నారు. ఇతర వివరాలకు సచివాలయాల్లోని అమినిటీ కార్యదర్శులను నేరుగా కలవాలని సూచించారు.

సాఫ్ట్ క్వీన్

- సాఫ్ట్‌బాల్, ఫెన్సింగ్‌లో సత్తా చాటుతున్న భవిత
- జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలో రజత విజేత
- పేదింట వెలిగిన క్రీడా రత్నం
- చదువులోనూ రాణిస్తున్న వైనం

ఐరాల: ప్రతిభకు పేదరికం అడ్డురాదు. పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదు. ఈ విషయం అక్షర సత్యమని నిరూపించింది మండలంలోని నాగంవాండ్లపల్లెకు చెందిన భవిత. పేదరికంలో పుట్టినా కష్టంతో జాతీయస్థాయిలో రాణిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న భవిత సాఫ్ట్‌బాల్, ఫెన్సింగ్‌లో విశేషంగా రాణిస్తోంది. ఈమె తల్లిదండ్రులు బాలకృష్ణ, సునీత. తండ్రి ఆటోడ్రైవర్, తల్లి ఆశావర్కర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అరకొర సంపాదనతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. భవిత మూడో కుమార్తె, మొదటి కుమార్తె ఉషశ్రీ, రెండో కుమార్తె జాహ్నవి సాఫ్ట్‌బాల్ బాగా ఆడేవారు. వీరిద్దరూ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నారు. ఆర్థిక స్తోమత లేక తల్లిదండ్రులు పెద్ద కుమార్తెకు వివాహం చేశారు. రెండో కుమార్తె స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. భవిత క్రీడలతో పాటు చదువులోనూ చురుగ్గా రాణిస్తోంది. చిన్నప్పటి నుంచి తల్లిదండ్రుల కష్టాల్ని చూసి బాగా చదువుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణించి క్రీడా కోటాలో పోలీస్ అధికారి కావాలని పట్టుదలతో కృషి చేస్తోంది. పాఠశాలలో 6వ తరగతి నుంచి సాఫ్ట్‌బాల్, ఫెన్సింగ్ క్రీడలను ఎంపిక చేసుకొని, పీడీ దేవా దగ్గర శిక్షణ తీసుకొని అనేక సార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటింది.

ఆదర్శంగా తీసుకొని..

తన ఇద్దరు అక్కలను ఆదర్శంగా తీసుకున్న భవిత ఆరవ తరగతి చదువుతున్న సమయంలో సాఫ్ట్‌బాల్, ఫెన్సింగ్ క్రీడపై ఆసక్తి కనబరిచింది. అక్కడున్న పీడీ దేవా విద్యార్థినికి సాఫ్ట్‌బాల్, ఫెన్సింగ్‌లో శిక్షణ ఇచ్చి ప్రోత్సహించారు. దీంతో భవిత జిల్లా స్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయికి ఎంపికైంది. సాఫ్ట్‌బాల్ క్రీడలో పిక్చర్(బౌలింగ్), స్లగింగ్(బ్యాటింగ్) చేయడంలో భవిత దిట్ట. 2021లో అనంతపురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో మొదటిసారి పాల్గొన్న భవిత అద్భుతమైన ఆటతీరు కనబరిచింది. అక్కడి నుంచి వెనుదిరిగి చూడలేదు. తాను పాల్గొన్న ప్రతి పోటీలోనూ రాణించింది. ఇటీవల జమ్ము, కాశ్మీర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్స్ పోటీల్లో అద్భుత ప్రదర్శనతో రజత పతకం సాధించింది.



జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలో సాధించిన ట్రోఫీ, రజత పతకం చూపుతున్న భవిత

కత్తి సాములో దిట్ట



రాష్ట్రస్థాయి అండర్-14 ఫెన్సింగ్ పోటీల్లో ప్రశంసాపత్రం, వెండి పతకం అందుకుంటున్న భవిత

తల్లిదండ్రుల నమ్మకం వమ్ము చేయకుండా భవిత కత్తి సాములోనూ ప్రావీణ్యం సంపాదించింది. గత సంవత్సరం నంద్యాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ వ్యక్తిగత(ఫాయిల్) విభాగంలో పాల్గొని రజత, కాంస్య పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. అదేవిధంగా 2024లో ఛత్తీస్‌గఢ్‌లో నిర్వహించిన 67వ జాతీయ స్థాయి అండర్-14 ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొని విశేష ప్రతిభ కనబరిచింది.

రోజూ శిక్షణ



పాఠశాల క్రీడా మైదానంలో నిత్యం క్రీడాకారులకు అవసరమైన మెలకువలు నేర్పుతున్నాం. ఉదయం, సాయంత్రం రోజుకు నాలుగైదు గంటల శిక్షణ అందిస్తున్నాం. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి జాతీయ స్థాయిలో పదిమందికి పైగా రాణిస్తున్నారు. సాఫ్ట్‌బాల్, ఫెన్సింగ్‌లో క్రీడాకారులు నైపుణ్యం ప్రదర్శిస్తున్నారు.

\- దేవా, పీడీ, ఐరాల

తల్లిదండ్రుల కష్టాలు దూరం చేస్తా



నా తల్లిదండ్రులు కష్టపడుతూనే ముగ్గురు పిల్లల్ని చదివించారు. వారు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా చదువుతో పాటు క్రీడల్లో రాణించి క్రీడా కోటాలో పోలీస్ అధికారి కావాలన్న నా లక్ష్యాన్ని చేరుకుంటాను. మా అక్కలు కూడా సాఫ్ట్‌బాల్‌లో రాష్ట్ర స్థాయిలో ఆడి మంచి ప్రతిభ కనబరిచారు. అమ్మానాన్నల కష్టాలను దూరం చేయడమే నా లక్ష్యం.

\- భవిత, నాగంవాండ్లపల్లె, ఐరాల

చాలా గర్వంగా ఉంది



రెక్కల కష్టంతో పిల్లల్ని పోషించుకుంటున్నాం. మా బిడ్డ జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తుంటే చాలా గర్వంగా ఉంది. మేం పడుతున్న కష్టాలు పిల్లలకు రాకూడదని కోరు కుంటున్నాం. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాం.

\- సునీత, బాలకృష్ణ, నాగంవాండ్లపల్లె, ఐరాల

సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ర్యాంకర్స్ పాఠశాల విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ వినియోగం తప్పనిసరి అని ర్యాంకర్స్ పాఠశాల కరస్పాండెంట్ రమణారెడ్డి అన్నారు. మిట్టూరులోని ఆ పాఠశాలలో సోమవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చాలా మంది ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వినియోగించకపోవడం వల్లే ప్రమాదాలకు లోనవుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. హెల్మెట్ వినియోగం వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆ పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల డైరెక్టర్ జయశ్రీ, రిటైర్డ్ ఎంఈవో రామ్మూర్తి నాయుడు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారమవ్వాలి



ప్రజల నుంచి వినతులు తీసుకుంటున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)లో వచ్చే ఫిర్యాదులు, వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి సిబ్బంది చర్యలు తీసుకోవాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి వినతులు తీసుకున్నారు. ఆర్థికపరమైన అంశాలతో ముడిపడి ఉన్న వాటిని ప్రాధాన్యత క్రమంగా, మిగిలిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. ఇంజినీరింగ్, టిడ్కో, టౌన్‌ప్లానింగ్, ప్రజారోగ్యం, రెవెన్యూ, మెప్మా విభాగాలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. గ్రీవెన్స్‌లో సహాయ కమిషనర్ ప్రసాద్, మునిసిపల్ ఇంజనీరు వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారాలు



కలెక్టర్ నుంచి పురస్కారం అందుకుంటున్న కదా పీఎంటీ ప్రేమ్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉత్తమ ఉద్యోగులను గణతంత్ర దినోత్సవ పురస్కారాలకు ఎంపిక చేశారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ మైదానంలో ఆదివారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, ఎస్పీ మణికంఠ చందోలు, జాయింట్ కలెక్టర్ విద్యాధరి చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగులు పురస్కారాలు స్వీకరించారు.



విజయశంకర్, కలెక్టరేట్



భారతి, ఆఫీస్ సబార్డినేట్



హైందవి, జేఏ, బీసీ వెల్ఫేర్



పుష్పామిత్ర, డిజిటల్ అసిస్టెంట్



శ్రీదేవి, డీటీ, కలెక్టరేట్



నాగరాజులు, డీటీ, కలెక్టరేట్



శ్వేత, డీఈ, ఆర్ అండ్ బీ



శివరామ్, డీఈ, ఎన్‌హెచ్



వరలక్ష్మి, ఏసీ-2, కమర్షియల్‌ట్యాక్స్



జయశ్రీ, జేఏ, డీపీవో కార్యాలయం



సాయిరాకేష్, ఎస్‌ఏ, కలెక్టరేట్



వాసంతి, ఏబీసీడబ్ల్యూవో, చిత్తూరు

అలరించిన కచేరి



కాణిపాకం: కాణిపాకంలోని దేవస్థాన ఆస్థాన మండపంలో సోమవారం త్యాగరాజస్వామి కచేరి భక్తులను అలరించింది. నాయీబ్రాహ్మణుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కచేరికి జిల్లా నలుమూలల నుంచి కళాకారులు హాజరై భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కళా వాయిద్యాలతో అలరించారు. కార్యక్రమంలో ఈవో పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు పాల్గొన్నారు.

వీరజవాన్‌కు ఎక్సైజ్ అధికారుల నివాళి



వీరజవాన్‌కు నివాళులర్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

బంగారుపాళెం: ఉగ్రవాదుల దాడిలో వీరమరణం పొందిన జవాన్ కార్తీక్‌ను దేశప్రజలు ఎన్నటికీ మరచిపోరని చిత్తూరు రూరల్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ పురుషోత్తం అన్నారు. సోమవారం సిబ్బందితో కలసి మండలంలోని ఎగువరాగిమానుపెంట గ్రామంలో కార్తీక్ కుటుంబసభ్యులను పరామర్శించారు. వీరజవాన్ కార్తీక్ తల్లి సెల్వి, తండ్రి వరదరాజులు మండడి, సోదరుడు రాజేష్‌ను ఓదార్చారు. కార్తీక్ కుటుంబానికి అండగా నిలుస్తామన్నారు. అనంతరం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

మరుగుదొడ్ల శుభ్రతకు రసాయనాలు



హెచ్‌ఎంకు రసాయనాలు అందజేస్తున్న సీఆర్‌పీలు

తవణంపల్లె: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని మరుగుదొడ్లు శుభ్రం చేసేందుకు ప్రభుత్వం రసాయనాలు సరఫరా చేసింది. మండలంలోని 64 పాఠశాలల్లో బాలురకు, బాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఉన్నాయి. మరుగుదొడ్లు శుభ్రం చేయడానికి ఇప్పటివరకు రసాయనాలు సరఫరా కాలేదు. ఈ క్రమంలో తాజాగా రసాయనాలను ఎంఆర్‌సీకి సరఫరా చేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సీఆర్‌పీలు సోమవారం పంపిణీ చేశారు.

ప్రతిభ చాటిన మంగళపల్లె విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బంగారుపాళెం: మండలంలోని మంగళపల్లె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు హిందీ ప్రతిభా పరీక్షల్లో మంగళపల్లె విద్యార్థులు ప్రతిభ చాటినట్లు సోమవారం హెచ్‌ఎం రాజ్యలక్ష్మి తెలిపారు. భారత దేశ జాతీయ హిందీ భాషా ప్రచారంలో భాగంగా గత ఏడాది నవంబరులో ప్రొద్దుటూరుకు చెందిన దశమంద విద్యాసేవాసదన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో హిందీ ప్రతిభా పరీక్షలు నిర్వహించారన్నారు. పాఠశాలకు చెందిన 22 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు చెప్పారు. 18 మంది విద్యార్థులు పరీక్షలో సత్తాచాటారని చెప్పారు. పాఠశాలకు చెందిన సిరి, కావ్య బంగారు పతకాలు సాధించగా, చాణక్య, శాంతిప్రియ వెండి పతకాలు సాధించారని వివరించారు. మిగిలిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ సాధించి సర్టిఫికెట్లు పొందారని తెలిపారు. విద్యార్థులు ఉత్తమ ప్రతిభ సాధించేందుకు కృషి చేసిన హిందీ ఉపాధ్యాయురాలు భారతి హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో జన విజ్ఞానవేదిక జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్‌శివప్రసాద్, ఉపాధ్యాయులు సంజీవి, పిళ్లారప్ప, సంపంగి, ప్రేమకృష్ణ, ధనశేఖర్, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అంధకారాన్ని తొలగించిన అల్వా ఎడిసన్



ఎలక్ట్రీషియన్ డే లో పాల్గొన్న ఎలక్ట్రీషియన్లు

బంగారుపాళెం: ప్రపంచంలో అంధకారాన్ని తొలగించిన మహనీయుడు థామస్ అల్వా ఎడిసన్ అని మండల ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ నాయకులు అన్సర్‌బాషా, గణపతి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఎలక్ట్రీషియన్ డేని మండల ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎలక్ట్రీషియన్స్ పతాకాన్ని ఎగురవేసి బల్బును కనుగొన్న థామస్ అల్వా ఎడిసన్‌కు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, థామస్ అల్వా ఎడిసన్ విద్యుత్ బల్బును కనుగొని ప్రపంచంలోని అంధకారాన్ని తొలగిస్తూ వెలుగును అందించారని చెప్పారు. 2019 జనవరి 27వ తేదీ నుంచి ఎలక్ట్రీషియన్స్ డే జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఎలక్ట్రీషియన్లు ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపనిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీనివాసులు, సుధీర్, ముబారక్, శేఖర్, పలువురు ఎలక్ట్రీషియన్లు పాల్గొన్నారు.

లంపీస్కిన్ వ్యాధితో జాగ్రత్త



మాట్లాడుతున్న పశు వైద్యాధికారి సాయిసుధ

గుడిపాల: పాడి పశువులకు వచ్చే లంపీస్కిన్ వ్యాధితో రైతులు జాగ్రత్తగా ఉండాలని పశువైద్యాధికారి సాయిసుధ సూచించారు. మండలంలోని చిత్తపార, బట్టువాళ్లూరు గ్రామాల్లో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం లంపీస్కిన్ వ్యాధి అధికంగా ఉందని పశువులు ఆ వ్యాధి సోకగానే వెంటనే పశువైద్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. అనంతరం 205 పశువులకు చికిత్సలు చేసి పిడుదుల మందు, డీవార్మింగ్ మందు పిచికారీ చేశారు. గర్భకోశ వ్యాధి చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది జ్యోత్స్న, అబ్దుల్లా, శివ, కిషోర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



బీపీ పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని మాధవరంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ 32 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు, వృద్ధులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రస్తుతం మంచు అధికంగా కురుస్తోందని, ఉదయం మంచులో మనుషులు తిరిగితే జబ్బుల బారినపడతారని వివరించారు. మంచు ఆరే వరకు ఆరుబయట తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రక్తహీనత రాకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా చంద్రశేఖర్‌రెడ్డి

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు అర్బన్ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా సోమవారం సాయంత్రం చంద్రశేఖర్‌రెడ్డి బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కళావతి ఉద్యోగోన్నతిపై డిప్యూటీ కలెక్టర్‌గా వెళ్లారు. ఇక్కడకు గుడిపాల తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ప్రభుత్వ భూములు ఆక్రమించొద్దు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రభుత్వ భూములు ఆక్రమించరాదని చిత్తూరు అర్బన్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. చిత్తూరు నగరం ఇరువారం ప్రాంతంలో ఆక్రమణ భూమిని సోమవారం తొలగించారు. ఈ భూమిని పీఆర్ ట్రైనింగ్ సెంటర్, ఈఎస్ఐ ఆస్పత్రుల నిర్మాణానికి కేటాయించినట్లు ఆయన తెలిపారు. 1.2 ఎకరాల భూమిని ట్రైనింగ్ సెంటర్‌కు, 50 సెంట్లు ఈఎస్ఐ ఆస్పత్రికి కేటాయించామని ఆయన పేర్కొన్నారు. ఈ భూముల్లో ఎవరైనా ఆక్రమణకు పాల్పడితే చర్యలు తప్పవని అర్బన్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ హెచ్చరించారు.